క్లుప్తంగా

గద్దర్ సంస్మరణ సభ



నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

బోథ్: మండల కేంద్రంలోని షాదీఖానాలో ఆదివారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఉద్యమకారులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో, తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి తన పాటతో ఉద్యమానికి ఊపిరి పోశారని వక్తలు కొనియాడారు. ఆయన మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్, నాయకుడు ఆడే గజేందర్‌లు మర్యాద పూర్వకంగా ఆదివారం కలిశారు. ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలపై చర్చించారు.

ఢిల్లీ సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై తెలంగాణ నేతలతో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదివారం ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ హాజరయ్యారు.

జాతీయ అధ్యక్షుడిని కలిసిన నరేశ్ జాదవ్

ఎదులాపురం: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, జాతీయ కోఆర్డినేటర్ కొప్పుల రాజులను ఏఐసీసీ సభ్యుడు నరేశ్ జాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశంలో పీసీసీ, ఎస్సీ, ఎస్టీ ముఖ్య నాయకులతో పాటు నరేశ్ జాదవ్ పాల్గొన్నారు. సీడబ్ల్యూసీ మెంబర్‌గా నియామకమైన జాతీయ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు సన్మానించారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి జె.నారాయణ అన్నారు. జాతీయ శాస్త్రీయ దృక్పథ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. నరేంద్ర దొబ్బెల్కర్ వర్ధంతిని పురస్కరించుకొని జాతీయ శాస్త్రీయ దృక్పథం దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, కోశాధికారి శ్రీధర్‌బాబు, ఉపాధ్యక్షుడు గంగన్న, ఉమాకాంత్, వేముల నాగరాజు, రంజిత్ రెడ్డి, ప్రకాష్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం సాగుతోంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అన్నదాన కార్యక్రమానికి సుభాష్‌నగర్ వార్డు కౌన్సిలర్ లక్షణ్, అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్పాత్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు సంతోష్, రామకృష్ణ హాజరై పేదలకు భోజనాన్ని వడ్డించారు. ట్రస్ట్ చైర్మన్ సుధీర్‌కుమార్, మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య, నిఖిల్, లఖన్ పాల్గొన్నారు.

ఎస్సై సునీల్‌కు సన్మానం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఎస్సై సునీల్‌కు ఉత్తమ సేవ అవార్డు అందుకోవడంతో ఆదివారం ఇంద్రవెల్లి అన్నాభావు సాఠే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సభ్యులు కాంబ్లే బాల్‌రాజ్, రాందాస్, నగేశ్, బాలాజీ, మాధవ్, శంబాజీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బేల: మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో కడు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న నిరుపేద బాస దాసు కుటుంబానికి ఆదివారం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో నరేందర్, నాక్లే విఠల్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి నివాసంలో రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దిగంబర్‌రావు పాటిల్, సాగిర్ ఖాన్, మధుకర్, అన్వర్ పాల్గొన్నారు.

బోథ్: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత్‌లో టెక్నాలజీ రంగాన్ని అభివృద్ధి చేసిన ఘనత రాజీవ్ గాంధీదేనని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సల్ల రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్, పసుల చంటి, మండల అధికార ప్రతినిధి అబ్రార్, మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ రహీమోద్దిన్, బత్తుల రమేశ్, గుడాల శేఖర్, అబ్దుల్ ఆసీఫ్, సలీం, శంకర్ పాల్గొన్నారు.

నార్నూర్: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియా గాంధీ చౌక్ వద్ద భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లోఖండే దేవురావు, యుసుఫ్‌ఖాన్, కైలాస్ జాదవ్, కరీంఖాన్, షెక్ సత్తార్, జాకురుల్లాఖాన్, అడే ప్రకాష్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బ్లాక్ ప్రెసిడెంట్ ఇక్బాల్, మండల ప్రెసిడెంట్ మల్లారెడ్డి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ము విజయ్, పుర్క బాపురావు, సునీల్, లింగంపల్లి చంద్రయ్య, కలీం, అర్షద్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రామారావ్ సలాంజాకు, తొడసం జంగు, భూమన్న, జంగు, విష్ణు, మదన్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, గుండవార్ సంజయ్, వాంఖడే వామన్, దేవ్‌తాళే విఠల్, ఘణేశ్యాం, మడావి చంద్రకాంత్, అఖిల్, అవినాష్ పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి

ఇంద్రవెల్లి: రాజీవ్‌గాంధీ ఆశయాల సాధనకు ప్రతిఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ హయాంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహానేత అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ జహీర్, సోన్ కాంబ్లే జితేందర్, చహకటి మానిక్‌రావ్, సోమసే వెంకట్‌రావ్, గాయక్వాడ్ భగవాన్, బాబాసాహెబ్, శివాజీ, ప్రకాష్, ఉమేష్, అనిల్, బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



బోథ్: నినాదాలు చేస్తున్న నాయకులు



గుడిహత్నూర్‌లో..



బేల: నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ, నాయకులు



నార్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

హక్కుల సాధన కోసం సంఘటితం కావాలి



మాట్లాడుతున్న టేకం భాస్కర్

ఉట్నూర్‌రూరల్: హక్కుల సాధన కోసం కొలాం ఆదివాసీలు సంఘటితం కావాలని కొలాం సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టేకం భాస్కర్ అన్నారు. ఆదివారం మండలంలోని హస్నాపూర్‌లో సమావేశం నిర్వహించారు. కొలాం ప్రజలు ఐక్యంగా ఉండి హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ 9 తెగలను విచ్ఛినం చేసేందుకు తుడుందెబ్బలో ఒకవర్గం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఐటీడీఏ డైరెక్టర్‌లు ఆత్రం లక్ష్మణ్, ఆత్రం భీంరావులు మాట్లాడుతూ.. కొలాంలు చదువుపై దృష్టి సారించి అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి టేకం వసంత్, ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి టేకం లక్ష్మణ్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆత్రం గంగారాం, సిడాం రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాఠకులకు అందుబాటులో ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: పాఠకులకు గ్రంథాలయ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కేవీ మునేశ్వర్ అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయ నిర్వహణ రికార్డులు, పుస్తకాలను పరిశీలించారు. పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరూ సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా గ్రంథాలయంలో గడపాలన్నారు. అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి గ్రంథాలయ శాఖ అధికారి కాంబ్లే వెంకటి, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



గమ్యం యాప్ గురించి వివరిస్తున్న హుస్సేన్

ఆదిలాబాద్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన అన్నారు. ఆర్టీసీ బస్సుల సమయసారణి, బస్సు ప్రయాణిస్తున్న ప్రాంతాన్ని సులభంగా గుర్తించడానికి ఆర్టీసీ గమ్యం బస్సు ట్రాకింగ్ ప్యాసింజర్ యాప్ విడుదల చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు గమ్యం యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానంపై ఆదివారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వలన బస్సుల వివరాలు, నిర్దిష్ట సమయాన్ని తెలుసుకునే వీలు ఉంటుందన్నారు. అవగాహన కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ జనార్దన్, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్, ట్రాకింగ్ ఇన్‌చార్జి సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం నాయకులు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే జోగు రామన్న నివాసంలో వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి 40 కిలో మీటర్ల దూరంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో జైనథ్, బేల మండలాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు దూరభారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత, లెక్చరర్లు ప్రతాప్‌సింగ్, సంగీత, తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరికలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆయా పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని అంకోలి గ్రామంలో ఆదివారం నిర్వహించిన చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసందర్భంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. దళితుల అభివృద్ధి కోసం దళితబంధు, బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నాభావుసాఠేకు భారతరత్న ఇవ్వాలి

ఆదిలాబాద్‌రూరల్: సాహితీ రంగానికి సేవలందించిన అన్నాభావుసాఠేకు భారతరత్న ఇవ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడలో నిర్వహించిన సాహిత్య సామ్రాట్ అన్నాభావుసాఠే జయంతి వేడుకలకు హాజరయ్యారు. నివాళులర్పించారు. రూ.5 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి కోఆర్డినేటర్ రోకండ్ల రమేశ్, దీపక్ మోరే, మెట్టు ప్రహ్లాద్, యూనుస్ అక్బాని, ఇస్రార్, షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చిగురించిన ఆశలు..



ఏపుగా పెరిగిన సోయా

- పక్షం రోజులుగా జాడలేని వానలు
- ఇటీవల కురిసిన వర్షంతో రైతుల హర్షం

బజార్‌హత్నూర్: మండలంలో 80 శాతం సాగు భూమి మెట్ట ప్రాంతం కావడంతో రైతులు వర్షాధార పంటలు వేశారు. అయితే గత నెలలో భారీ వర్షాలు కురిసినప్పటికీ, పక్షం రోజులు వర్షం జాడలేదు. దీంతో పూత దశలో ఉన్న పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న పంటలు ఎక్కడ ఎండిపోతాయోనని ఆందోళన చెందారు. ఎట్టకేలకు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పత్తికి ప్రాధాన్యం..

మండలంలో ఖరీఫ్ సాగులో 32 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ప్రధాన పంటగా పత్తి 18 వేల ఎకరాల్లో, సోయా 8 వేల ఎకరాల్లో, కంది 2 వేల ఎకరాల్లో, మొక్కజొన్న 1200 ఎకరాల్లో, మిగతా 800 ఎకరాల్లో పెసర, మినుము, కూరగాయలు పండిస్తున్నారు. ఆగస్టులో సోయా పూత దశలో ఉన్న సమయంలో వర్షాలు లేక తేమ శాతం పడిపోయింది. ఎక్కడ పూత రాలిపోతుందో, పంట నష్టం జరుగుతుందని ఆందోళనతో ఉన్న రైతులు వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు.

పంట వాడిపోయింది



నాలుగు ఎకరాలతో పాటు, మరో 8 ఎకరాల కౌలుకు తీసుకొని పంటలు సాగు చేస్తున్నాను. ఇందులో 8 ఎకరాలు సోయా, 4 ఎకరాలు పత్తి వేశాను. గత నెలలో భారీ వర్షాలకు సోయా దెబ్బతింది. గత పక్షం రోజులుగా వర్షం లేక పోవడంతో పంట వాడిపోయే స్థితికి చేరింది.

– తాండ్ర శ్రీనివాస్, బజార్‌హత్నూర్

తేమ శాతం పెరిగింది

రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సాగు భూమిలో తేమ శాతం పెరిగింది. పంట ఎదుగుదలకు వాడే రసాయనిక ఎరువులను తొందరపడి వేయవద్దు. అధిక వర్షాలతో అడుగు మందులు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వర్షాలకు పత్తిలో తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

– సంతోష్, ఏఈవో, బజార్‌హత్నూర్

అన్నాభావుసాఠే జయంతి



అన్నాభావుసాఠే జయంతి వేడుకలు

సిరికొండ: మండలంలోని రాంపూర్(బి) గ్రామంలో అన్నాభావుసాఠే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేకంగా పూజలు చేసి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు గాడేకర్ పరుశురామ్ పాల్గొని మాట్లాడారు. మన మాంగ్ సమాజ్ కోసం అన్నాభావు సాఠే త్యాగాలు, ఆయన రచించిన రచనలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాంబరే రేణుక బాయి, ఉప సర్పంచ్ సూర్యవంశీ ప్రహ్లాద్, చండె బాలాజీ, సంజీవ్ పాటిల్, గడ్గే శివాజీ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఇంద్రవెల్లి మండలంలో నెల 28న నిర్వహించే అన్నాభావుసాఠే జయంతి విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు కాంబ్లే బాలరాజ్ కోరారు. ఆదివారం ఉట్నూర్ ప్రెస్‌భవన్‌లో జయంతికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ ఉత్సవానికి ప్రముఖ గురువు సద్గురు గజానంద్ మాళి, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, ఎమ్మెల్యే రేఖానాయక్‌లు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, ఆనంద్‌రావు, మహదేవ్, గంగాధర్, నరేశ్, జనార్దన్, అరుణ్, సంజీవ్, సునీల్ పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ రామేశ్వర్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలని వీటుకెన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వం సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులకు ఇంగ్లిష్ బోధించడం జరుగుతుందని, తల్లిదండ్రులు సైతం పిల్లలను ఇంగ్లిష్ మీడియం చదివిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు మరిన్ని మెళుకువలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శిక్షణ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కంటె నర్సయ్య, ఉపాధ్యాయులు సాగర్ రెడ్డి, శ్రీనివాస్ స్వామి పాల్గొన్నారు.

నూతన మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలి



రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్: నిర్మల్ మున్సిపాలిటీ నూతన మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి అన్నారు. నిర్మల్‌లో బీజేపీ కార్యకర్తలపై జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సుహాసినిరెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ నూతన మాస్టర్ ప్లాన్ ద్వారా అక్కడి రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రజాప్రతినిధుల రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే నూతన మాస్టర్ ప్లాన్ కోసం ప్రభుత్వం జీవో 220ని విడుదల చేసిందని, దీనిని రద్దు చేయాలని ఐదు రోజులుగా బీజేపీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేసే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మండల ఏర్పాటుతో సంబురాలు



ఎంపీపీకి స్వీట్ తినిపిస్తున్న నాయకులు

జైనథ్: జైనథ్ మండలంలో కొత్తగా సాత్నాల, భోరజ్ మండలాలను ఏర్పాటు చేస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు సంబురాలు జరుపుకున్నారు. సాత్నాల వద్ద ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్ ఆధ్వర్యంలో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని, టపాసులు పేల్చారు. ఎమ్మెల్యే జోగు రామన్న, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు పెందూర్ దేవన్న, పెందూర్ మోహన్, తానాజీ, పెందూర్ భరత్, పాచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలచిన వారు సంప్రదించండి.

ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినోద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899